# ౨౨

## అబ్రహాం లింకన్

ఆలిచిప్పలు ఎన్నో వుంటాయి
అందులో కొన్నే ముత్యాలను కంటాయి.
పురుషులు కోట్లకొలది వుంటారు
వారిలో పురుషోత్తములుగా కొందరే-అవుతారు.

మానవజాతి, నడిచి వచ్చిన చరిత్రదారులన్నిటిని చదివితే - ఆయా కాలాలలో-అప్పటి - అవసరాలనుబట్టి మహానుభావులు అవతరించి తమ కర్తవ్యం నిర్వర్తించి, తమముందు తరాలకు కొంతమేర దారి నిర్మించి, వెలుగు చూపించి అంతర్ధానం అవుతారేమో నన్పిస్తుంది.

ఈ యధార్థాన్నే-''ధర్మానికి ఆటంకం ఏర్పడినపుడల్లా నన్ను నేను సృజించుకుంటాను-'' అన్న గీతా వాక్యంగా చెప్పివుంటారని అర్థం చేసుకోవచ్చు.

ఆ విధంగా వివిధ యుగాలలో అవతారమెత్తిన పురుషోత్తములందరూ మనందరిలాగనే వుంటూనే మనకన్న భిన్నంగా వుంటారు. మనందరి మధ్య వర్తమానంలో మసలుతూనే భవిష్యత్తును స్పష్టంగా చూడగల్గుతారు, మనకు గందరగోళంగా అన్పించే పరిస్థితుల కారు మబ్బులను వారి ఆలోచనతో, దృష్టితో, మందలింపుతో, ఆదర్శంతో పటాపంచలుచేసి వెలుగు బాటలువేసి పెడతారా మేలిరకపు మేస్త్రీలు.

వారి జీవితాల చీకటి వెలుగులు వారి వ్యక్తిత్వంలోని ఇంద్ర ధనస్సులు. వారి మాటలు, చేతలు-పరిశీలిస్తే 'మనలాటి మానవ మాత్రులేనా వీరు?' అన్న ఆశ్చర్యం కల్గుతుంది.

★

అప్పట్లో అక్కడి న్యాయస్థానానికి భవంతి అంటూ ఏదీలేదు. కర్రచెక్కలతో నిర్మించిన 'షెడ్' లాటిదే న్యాయస్థానం. అక్కడికి న్యాయమూర్తి, ఆయన వెనకాలే లాయర్లు వాళ్ళూ గుర్రాలమీద వచ్చేవారు.

ఒకరోజు దారిమధ్యలో ఒక చెట్టునీడను కాస్సేపు ఆగారు వాళ్ళు. 'అతడు' కనపడలేదు. ''ఏడీ మనవాడు'' అని కలవరపడ్డారు. ఆ దారి వెంబడి వస్తూన్న ఒక దానయ్యకు ''మనవాడి'' ఆనవాళ్ళన్నీ చెప్పి-అడిగితే ఆ దానయ్య చెప్పాడు: ''ఓ...ఆయనా? ఇందాక పెద్ద గాలి వీచినప్పుడు ఆ వేగానికి కొన్ని పక్షిపిల్లలు గూళ్ళలోంచి క్రిందపడ్డాయి. ఆ పక్షిపిల్ల లన్నిటిని జాగ్రత్తగా సేకరించి, దువ్వి ఏపిల్ల ఏగూటిదా అని చెట్టు, చెట్టూ ఎక్కి వాటిని గూళ్ళల్లోకి చేర్చే ప్రయత్నంలో వున్నాడు. ఈలోగా రాత్రి అయినా సరే, కోర్టు అయిపోయినాసరే. ఆ పనంతా పూర్తయితేగాని ఆయన కదిలి వచ్చేటట్టులేదు-'' అని వివరించాడు.

- ఆపక్షికూనల రక్షకుడే ఒక కొత్తవూళ్ళో దుకాణంలో పనికి కుదిరాడు. అతడి వినయం, విజ్ఞానం, ధైర్యం, సాహసం ఆ వూరివారందరినీ ఆకట్టుకున్నాయి. కాని ఈ కొత్తవాడింతలా జనుల మెప్పుదలకు పాత్రుడవడం గిట్టని ఆ వూరి ఆకతాయిలు కొందరతడికి 'తగిన శిక్ష' విధించాలనుకున్నారు. వారి నాయకుడయిన పెద్ద రౌడీతోసహా బయలుదేరి దుకాణం దగ్గరకు వెళ్ళారు.

''ఓయ్ హీరో! నిజంగా నువ్వు మగాడివే అయితే మా నాయకుడితో కుస్తీకి రావాలి. సిద్ధమేనా?'' అని సవాలు చేశారు.

అతడు 'సరే' నన్నాడు.

కుస్తీలో తాను ఓడిపోతున్నానని తెలుసుకున్న జట్టు నాయకుడు ఒక అభ్యంతరకరమైన 'పట్టు'కోసం పెనుగులాడసాగాడు. వెంటనే 'అతడు' తన పట్టువదిలేసి, అమాంతం ఆ దుష్టుడి మెడ పట్టుకొని గాలిలోకి పైకెత్తి,

బొమ్మలా ఇటూ అటూ ఊగించి క్రిందకు విసిరివేశాడు. తమ నాయకుడు క్రిందపడడం చూచిన ఆ జట్టువారందరూ కలిసి 'అతడి' మీదికి లంఘించ నుండగా వారి నాయకుడు లేచి నిలబడి వారిని వారించాడు: ''ఆగండి, ఈ చుట్టుప్రక్కల్లో యింతకన్న గొప్పవాడు లేడు''.అని 'అతడి'తో తన చేతులు కలిపాడు. ఆనాటినుండి వారిద్దరూ గాఢమిత్రులయ్యారు.

—ఆ విధంగా పక్షికూనలను రక్షించిన కుసుమ కోమలమైన ఆర్ద్రతా-అవసరం వచ్చినప్పుడు దుష్టుడిని తగిన విధంగా శిక్షించగల వజ్ర సమాన మైన కాఠిన్యతా మేళవించిన మహామనీషి పేరే అబ్రహాం లింకన్!

మన దేశానికి బానిసత్వం నుంచి విముక్తి ప్రసాదించిన మహాత్మా గాంధీ దేశం రెండుముక్కలు కాకుండా ఆపలేకపోయాడు. కాని అమెరికా దేశం రెండు ముక్కలు కాకుండాచేసి, అక్కడి కోట్లాది నీగ్రో బానిసలకు స్వాతంత్ర్యం ప్రసాదించిన మహానుభావుడు అబ్రహాంలింకన్!

1809 ఫిబ్రవరి 12న పేదరికంలో పుట్టిన అబ్రహాం తండ్రి నిరక్షరకుక్షి: తల్లి చదవనేర్చినది ఆమె చదివిన పుస్తకాలన్నీ తానూ చదివేవాడు. ఇతరుల నుండి బ్రతిమిలాడి, అరువుతెచ్చుకుని చదివేవాడు. పగలల్లా కట్టెలు కొట్టడంలోనో, పశువులు మేపటంలో తల్లికి సాయంలోనో గడిచి పోయేది. అంచేత రాత్రిళ్ళు చదవవలసి వచ్చేది. కాని కొవ్వొత్తి కొనగల స్తోమత ఆ కుటుంబానికి లేదు. అంచేత రాత్రి అందరూ పడుకు న్నాక చలి మంటల కుంపటిలో మండే కర్రల వెలుతురులో చదువుకునేవాడు అబ్రహాంలింకన్!.... మరి ఈనాడు దీపాలు. అందులో విద్యుద్దీపాలు, గది, ఆహారం, పుస్తకాలు-అన్నీ సమకూర్చిపెడితే, పుస్తకాలక్కడ పారేసి, చిత్తమొచ్చినవల్లా అరిచి సాధించడానికి, బస్సులు తగల పెట్టడానికీ ''విద్యార్థులు'' ('డిగ్రీయార్థులు' - అన్నది ఆదర్శ సమాసం కాకపోయినా నిజానికి దగ్గరవుతుందేమో!) రోడ్డుమీదకు వెళ్ళిపోవడానికీ సిద్ధమవు తున్నారే... ఎక్కడ వుంది వైరస్? మనిషి కష్టపడి సాధించడంలో వున్న

థ్రిల్' సులభంగా దొరికే దానితో లేనందునా? "సెక్యూరిటీ", "ప్రేమ" వంటి పేర్లతో, రిజర్వేషన్లు డొనేషన్లు, గ్రేడ్లు, ఓపెన్‌బుక్ సిస్టమ్ - వంటి వాటితో అన్నీ సులభాతి సులభంగా చేసెయ్యగా శ్రమపడడానికి, సాధించ డానికి ఏమీలేక, ఉప్పొంగే యువశక్తికి వేరే దారి లేక ఇట్లా విరుచుకుపడి వృధా అవుతోందా? యువతకు మనం నూటికి నూరుపాళ్ళు మేలు చేస్తున్నా మనే అంటారా? ఏమో!

ఒకసారి అబ్రహాం లింకన్ "వాషింగ్‌టన్ చరిత్ర" అన్న పుస్త కాన్ని పొరుగింటాయన నుండి తెచ్చుకుని చదవసాగాడు. రాత్రిళ్లు చదవగానే ఆ పుస్తకాన్ని తలదిండుకింద దాచుకునేవాడు. ఒకనాటిరాత్రి పెద్దతుఫాను వర్షం వచ్చి కప్పులోంచి నీళ్ళు కారసాగాయి. పడకలతోసహా అన్నీ తడవగా ఆ పుస్తకంకూడా తడిసి కొంత పాడయింది. మరునాడు అబ్రహాం బాధపడుతూ ఆ పొరుగాయన వద్దకువెళ్ళి పుస్తకం పాడుచేసినందుకు తానేమి పరిహారం చెల్లించాలి-అవి అడిగాడు "మూడు రోజులపాటు తన కళ్ళంలో ధాన్యం నూర్చమన్నాడు" ఆయన. అప్పుడు-"ఆ పని పుస్తకం ధరకు సరిపోతుందా లేక పాడయినందుకు నష్టపరిహారం మాత్రమేనా?" అని అడిగాడు అబ్రహాం. అందుకతడు నవ్వి-ఇంకొ మూడు రోజులు అదనంగా పనిచేస్తే ఆ పుస్తకం నీదవుతుంది-" అన్నాడు. లింకన్‌యొక్క ఈ వ్యవ హార దక్షతే క్లిష్టదశలో వున్న జాతిని రక్షించడానికి మూలకారణం అయింది.

వ్యాపారస్తుల దగ్గర ఉద్యోగానికి కుదిరి, ఆ పనిమీద దేశమంతటా తిరుగుతుండగా అబ్రహాం లింకన్ వివిధ ప్రాంతాలలో వున్న అమానుష మైన బానిసత్వపు విధానాలనుచూచి చలించిపోయాడు. న్యూ ఆర్లియన్స్ రాష్ట్రంలో ఆడ బానిసలను కొరడాలతో కొట్టడం చూచి అతడికి రోత, ఆగ్రహం కలిగాయి. 1832లో రాజకీయాలలోకి ప్రవేశించాడు. శాసనసభ ఎన్నికల్లో మొదట ఓడినా, రెండేళ్ళ తర్వాత న్యూసలేంలో గెలిచాడు. పోస్టు మాస్టరుగా, లాయరుగా తన జీవనం సాగిస్తూనే రాజకీయాలలో తన బలాన్ని క్రమంగా పెంచుకుంటూ వచ్చాడు. 1847లో కాంగ్రెసులో సభ్యుడయ్యాడు మేరీ టాడ్‌ను పెళ్ళాడాడు.

ఆ సరికే దేశంలో బానిసత్వం వుండాలనే వాళ్ళంతా ఐకమత్యంగా బలంగా ఒక పార్టీగా వున్నారు కాని ఆ అనాగరికమైన విధానం విస్తరించ రాదని కోరే రాష్ట్రాలు ఎన్నివున్నా, ఆ ప్రజలంతా సరయిన నాయకత్వం లేక చెల్లాచెదరుగా వున్నాడు; వారందరినీ ఏకోన్ముఖులుగా చేసి, రిపబ్లికన్ పార్టీని స్థాపించిన మూలపురుషుడు అబ్రహాం లింకన్.

1858లో డిమొక్రటిక్ పార్టీ తరఫున సెనెట్‌కు తన పాత విరోధి డగ్లస్ నిలబడగా లింకన్ అతడిని ఓడించాడు. తన పార్టీతరఫున 1860లో అధ్యక్ష పదవికి ఎవరు పోటీ చేయాలోనని నిర్ణయించడానికి సమావేశమయిన సభలో అబ్రహాం లింకన్ ప్రసంగంవిన్న ఒకరు ఇలా వర్ణించారు.

"లింకన్ మాట్లాడానికి లేచి నిలబడ్డాడు. వికారంగా పొడుగ్గావున్న ఆకారం, నలిగిపోయి వదులుగావున్న బట్టలు, చేతులు విదిలిస్తూ మొదలు పెట్టిన తీరు చూస్తే-అబ్బే... "ఇతడు లాభంలేదు" అనుకున్నాను. కాని అతడు అసలు విషయంలోకి ప్రవేశించేసరికి అతని మొహంలో ఒక దివ్యతేజం వెలుగ సాగింది. అతడిలో అంతర్లీనమైన చైతన్యం మాటల రూపంలో వెలువడుతుంటే అతడి ఆకారం, బట్టలు అన్నీ మరచిపోయాను. నేనూ ఆ వేలాదిమందితోపాటు అరిచాను, చప్పట్లు కొట్టాను, హర్షాతిశయంతో ఒళ్లు మరిచాను"

ఆ తర్వాత 1860 జూన్ 17న అధ్యక్ష పదవికి రిపబ్లికన్ అభ్యర్థిగా లింకన్ ఎన్నికయ్యాడు. అతడు తన వూళ్ళో మిత్రులతో మాట్లాడుతుండగా ఈ శుభ వార్త వచ్చింది వెంటనే మిత్రులతో కరచాలనం చేసి, లేచి నిల్చుని "ఎనిమిదో నెంబరు వీధిలో వున్న ఒక ఇల్లాలికి యీ కబురు చెప్పాలి" అని తన ఇంటికి వెళ్ళాడట! -మన మగ వాళ్లల్లో సగం మందికి టూర్ మీద వెళ్ళితే భార్యకో కార్డుముక్క రాయడానికి తీరిక వుండదు!

అతడు అధ్యక్షుడుగా ఎన్నికవగానే, బానిసత్వాన్ని సమర్థించే దక్షిణ రాష్ట్రాలు తాము దేశం నుండి విడిపోతున్నామని ప్రకటించి యుద్ధా

నికి దిగాయి. అయినా స్థయిర్యం కోల్పోక అబ్రహాం లింకన్- "క్షణికోద్రేకం మన బాంధవ్యం మీద బరువు మోపిందే కాని మనం శత్రువులం కాము-" అని స్పష్టంగా చెప్పాడు. చెప్పినా యుద్ధానికి సన్నద్ధం అయ్యాడు. అయినా అవతలి వారు మొదటి దెబ్బ తీసేదాక తాను రంగంలోకి దిగలేదు. యుద్ధం మొదలయ్యాక అనేక పరాజయాలు పొందినా- "ఈ మెరికన్ యూనియన్ ఐక్యత కాపాడి తీరుతాను-" అని దీక్షాకంకణం ధరించి, తన వారందరికి, వెలుగు దీపమై నిలిచి అంతిమ విజయం సాధించాడు అబ్రహాం లింకన్.

1862 సెప్టెంబర్ 22న అమెరికాలో వున్న బానిస లందరికీ స్వేఛ్ఛ ప్రకటించడంలో అబ్రహాం లింకన్ కన్న కల నిజమైంది. 1865 ఏప్రిల్ 7న శత్రు పక్షపు సైన్యాలు శరణు వేడడంతో అంతర్యుద్ధం ముగిసి అమెరికా ఒక్క దేశంగా నిల్చింది. అమెరికాకు రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయిన లింకన్ ఏప్రిలు 14న తన గౌరవార్థం ఏర్పాటయిన ఒక నాటకానికి వెళ్లాడు. అక్కడ జాన్ విల్క్స్ బూత్ అన్న హంతకుడు పేల్చిన తుపాకి గుండ్లు మెదడులోకి చొచ్చుకుపోగా తక్షణం కూలింది వటవృక్షం!

అసాధారణ జీవితాలకు బహుశ అంతం కూడా అసాధారణంగా వుండాలన్న జగన్నాటక సూత్రం ఎదయినా వుందికాబోలు!

తను కాపాడిన దేశం ఒడ్డుకు చేరగా, ఆ కాపాడిన నాయకుడు నేల కూలడాన్ని అమెకన్ కవి వాల్ట్ విట్మన్ హృదయవిదారకంగా చిత్రించాడు.

"ఓ కెప్టెన్! నా కెప్టెన్!
తుఫానులు దాటి ఓడ రేవును సమీపించింది
అదుగో గంటలు మోగుతున్నాయి
ఒడ్డుమీద జనం ఆనందంలో తేలియాడుతున్నారు
కాని ఓడ డెక్ మీద

నా కెప్టెన్ చల్లగా వున్నాడు; చచ్చిపడి వున్నాడు!
-లే కెప్టెన్! నిద్రలే;
నీకోసమే ఆ పాట
ఆ కేక, ఆ చప్పట్లు
అన్నీ నీకోసమే!
ఊహు!
నౌక రేవుకు
సురక్షితంగా చేరింది
అయినా
నా కేప్టెన్ పలకడంలేదు!"

★